ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్టం : 40.0 కనిష్టం : 28.0

ANDHRAJYOTHY



అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 22 ఏప్రిల్ 2025

నేలరాలిన ఆశలు

- నేలరాలిన మామిడి
- కర్బూజ, బొప్పాయి, వరి నేలమట్టం
- తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు

7



చెన్నేకొత్తపల్లిలో దెబ్బతిన్న అరటిపంట

కన్నీటి వీడ్కోలు

అశ్రునయనాల మధ్య కేఎం జకీవుల్లా అంత్యక్రియలు
నివాళులు అర్పించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,
వివిధ రాజకీయ పార్టీల నాయకులు

6



జకీవుల్లా పాడెను మోస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

సారోళ్లు రారంట..!

- సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి రాం రాం
- పోస్టింగ్ ఇచ్చినా చేరని వైద్యులు
- ప్రజలకు అందని అధునాతన వైద్యం



సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): స్పెషలిస్టు డాక్టర్లు అనంత సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి రావడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో డాక్టర్లను ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ప్రయత్నిస్తున్నా, వైద్యులు ఆమేరకు వచ్చి పని చేయడానికి విముఖత చూపుతున్నారు. ఇటీవల వైద్యశాఖామంత్రి సత్య కుమార్‌యాదవ్ కూడా రాష్ట్ర స్థాయిలో జరిగిన ఓసమావేశంలో ఇదే విషయంచెబుతూ ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. డాక్టర్లను నియమిస్తున్నా మేం రాం అంటూ వెళ్లిపోతున్నారు.

నలుగురిని నియమించినా..

జిల్లా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఇటీవల నలుగురు స్పెషలిస్టు డాక్టర్లను ప్రభుత్వం నియమించింది. మార్చి నెలాఖరులో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టరు ప్రదీప్‌క్రిష్ణచౌదరి(కార్డియాలజిస్టు), డాక్టర్ రాజేష్ నాయక్(న్యూరాలజీ), డాక్టరు వినయ్(యూరాలజీ), డాక్టర్ వెంకట సింహా(అంకాలజీ)విభాగాలకు నియమించారు. నలుగురు స్పెషలిస్టులను నియమించడంతో మెరుగైన వైద్యం అందుతుందని రోగులు ఎంతో సంబరపడ్డారు. అయితే ముగ్గురు డాక్టర్లు జాయిన్ కాలేదు. న్యూరాలజీ డాక్టరు రాజేష్‌నాయక్ మాత్రమే జాయిన్ అయ్యారు. మిగిలిన ముగ్గురు డాక్టర్లలో ఓ డాక్టరు జాయిన్ కావడానికి వచ్చి వైద్యాధికారులను కలిశారు. తర్వాత అడ్రస్ లేకుండా పోయారు. ఈక్రమంలో రూ. 150కోట్లు పెట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కట్టినా వైద్యులు రాకపోతే పేదలకు అధునాతన వైద్య సేవలు అందడం గగనమే. ప్రభుత్వమే ప్రత్యేక చొరవ చూపి స్పెషలిస్టు వైద్యులు జాయిన్ అయ్యేలా చూడాలని పలువురు రోగులు వాడుతున్నారు.

ఒక్కరే జాయిన్ అయ్యారు

ఇటీవల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నలుగురు స్పెషలిస్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించిన విషయం వాస్తవమే. వారిలో ఒక్క డాక్టరు మాత్రమే జాయిన్ అయ్యారు. మిగిలిన ముగ్గురు రాలేదు. వారికిచ్చిన 15రోజుల గడువు ముగిసింది. దీంతో వారు ఇక్కడకు రావడం లేదని తెలుస్తోంది. ఈవిషయంలో మేమేమి చేయలేం. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- డాక్టరు మాణిక్యాలరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

నేడు కోర్టుకు బోరుగడ్డ అనిల్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐని బెదిరించిన కేసులో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు మంగళవారం అనంతపురం కోర్టుకు హాజరుపరచనున్నారు. 2018లో త్రీటౌన్ సీఐ మురళీకృష్ణను బెదిరించినట్లు అదే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టై.. బెయిల్‌పై బయటకు వచ్చిన అనిల్.. వాయిదాలకు హాజరు కాకపోవడంతో అనంతపురం మొబైల్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో రాజమహేంద్రవరం జైలు నుంచి అనిల్‌ను అనంతపురం పోలీసులు పీటీ వారెంట్‌పై ఈ నెల 4న తీసువచ్చిన అనంతపురం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి రిమాండ్ ఆదేశించడంతో తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. ఈ కేసు వాయిదా నిమిత్తం మంగళవారం అనంతకు తీసుకువస్తున్నారు. సోమవారం అర్ధరాత్రికి బోరుగడ్డ అనిల్‌ను అనంతపురానికి తీసుకువస్తారు.

ప్రజాప్రతినిధుల లేఖలకు ప్రాధాన్యం ఇవ్వండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు, ఉన్నతాధికారుల డీఓలకు ప్రాధాన్యమిచ్చి ఎప్పటికపుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రజాప్రతినిధుల సిఫార్సులు, ఉన్నతాధికారుల డీఓల లెటర్లు ఎన్ని వచ్చాయి, ఇప్పటి వరకు ఎన్నింటిని పరిష్కరించారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలం నేమకల్లు పర్యటనలో ఇచ్చిన ప్రతిహామీ అమలుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో జిల్లాలో ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ప్రక్రియ పక్కాగా చేపట్టాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సీపీఓ అశోక్‌కుమార్, అన్నిశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనంత ఆణిముత్యాలకు రూ.1.34 లక్షలు

రాప్తాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 2009లో నిరుపేద విద్యార్థుల సహాయార్థం అప్పటి జిల్లా కలెక్టర్ అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ సొసైటీని ప్రారంభించారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రసన్నాయపల్లి సమీపంలోని ఆర్‌జేసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అనంత ఆణిముత్యాలు ఫౌండేషన్‌కు కలెక్టర్ వినోద్ కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా రూ.1.34 లక్షల చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనంత ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా జిల్లాలో ఏడుగురు విద్యార్థులు లబ్ధి పొందారని అన్నారు. గతంలో కలెక్టర్, జిల్లా ఉద్యోగుల నుంచి విరాళాలు సేకరించి ఈ కార్యక్రమం చేపట్టేవారన్నారు. కలెక్టర్ రూ. 10 వేలు అందచేశారు. జేసీ, ఇతర ఉద్యోగులు తమ వంతు సాయం అందించాలని కలెక్టర్ తెలిపారు. అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషన్ సొసైటీ విరాళాలను జిల్లా కలెక్టర్ అనంతపురం అకౌంట్ నెంబర్: 1429 1001 1001 235 ఐఎఫ్ఎస్‌సి కోడ్ యుబిఐఎన్ 0814296కు ఫోన్‌పే, గూగుల్ పే చెల్లించి రసీదులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొందాలన్నారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, రామ్మోహన్, ఆర్డీఓ కేశవనాయుడు, డీపీఓ నాగరాజు నాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సునీత

అవినీతి సముద్రం..!

- ఉపాధి సొమ్మును మింగేస్తున్న కొందరు
- అక్రమ సంపాదనలో అధికారుల వాటాలు
- పని చేయకున్నా బిల్లులు.. ఒకే పనికి రెండు సార్లు
- బ్రహ్మసముద్రం మండలంలో తవ్వేకొద్దీ అక్రమాలు



సంతేకొండాపురం గ్రామం వద్ద ఫాంపాండ్ తవ్వినట్లు చూపించి బిల్లులు కాజేసిన పొలం ఇదే..

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం... పని చేసే కూలీలకు అరకొరగా కడుపు నింపుతున్నా, సిబ్బంది అవినీతికి మాత్రం కల్పతరువుగా మారింది. క్షేత్ర స్థాయిలో జరిగే అవినీతిని ఉన్నతాధికారులు ఏమాత్రం అరికట్టలేకపోవడంతో కొందరు సిబ్బంది రెండు చేతులా 'భోంచేస్తున్నారు'. బ్రహ్మసముద్రం మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో మొదలుపెడితే ఏపీడీ, ఎంపీడీవో, ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్ల వరకు అవినీతి సొమ్ములో వాటాలు పంచుకోవడం గమనార్హం. పనులు చేయకున్నా, పండ్లమొక్కలు నాటకపోయినా, క్షేత్రస్థాయిలో జాబ్‌కార్డుదారులు ఉపాధికూలీ పనులకు వెళ్లకపోయినా బిల్లులు మాత్రం యథేచ్ఛగా చెల్లించేస్తున్నారు. దీంతో ఉపాధి నిధులు దుర్వినియోగమవుతున్నాయి. పదేళ్ల కిందట నాటిన పండ్ల మొక్కలకు కూడా కొత్తగా నాటినట్లు బిల్లులను పెట్టుకుని నిధులను స్వాహా చేసిన సంఘటన వెలుగు చూశాయి. గత వైసీపీలో ప్రజా ప్రతినిధిగా ఉండి...ప్రస్తుతం మాజీగా ఉన్న నేత పక్క పంచాయతీలోకి వెళ్లి అక్కడ ఉపాధి హామీ పని చేసినట్లు బిల్లు తీసుకోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఫాంపాండ్స్ తవ్వకంలో ఓ తల్లి, ఓ తండ్రి పేరునరెండుసార్లు బిల్లులుస్వాహా చేసిన సంఘటన కూడా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇలా కొందరి స్వార్థానికి ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతోంది అనే పరిస్థితి డ్వామా ఉన్నతాధికారులు గమనించకపోవడం గమనార్హం.

పేరు కొడుకుది... పనిచేసేది తండ్రి

ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం కొడుకులది. అయితే ఆ ఉద్యోగం చేసేది మాత్రం తండ్రులు. తాజాగా ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. అందులో కొందరికి అర్హతలు లేకపోవడంతో కొడుకుల పేర్లతో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించారు. వారి స్థానంలో తండ్రులు విధులు నిర్వహిస్తున్నారు. బ్రహ్మసముద్రం మండలంలో నాలుగు పంచాయతీ లకు పైబడి ఇలానే విధులు నిర్వహిస్తున్నారు. వారికి కనీస అవగాహన లేకున్నా వారి స్థానంలో ఉద్యోగాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు నడుస్తున్నట్లు సమాచారం.

కప్పిపుచ్చుకునేందుకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పోస్టింగ్

అక్రమాలు బయటపెట్టినందుకు ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఆఫర్ చేశారు. వైసీపీ హయాంలో పని చేసిన ఓ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి పనుల్లో అక్రమాలను బయటపెట్టడంతో ఆయనకు మళ్లీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఉద్యోగం ఆఫర్‌గా ఇచ్చారు. ఇప్పటి నుంచి ఎలాంటి అక్రమాలు, అవినీతిని బయటకు పెట్టవద్దని ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను వేడుకుంటున్నారు. అయితే ఇలా వైసీపీ హయాంలో పని చేసిన ఓ ఫీల్డ్‌అసిస్టెంట్‌కు మళ్లీ ఉద్యోగం ఇవ్వడంతో గ్రామ పంచాయతీలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భగ్గుమంటున్నారు. అధికారులు వైసీపీ నేతలతో కుమ్మక్కయ్యారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కలెక్టర్, డ్వామా పీడీలు స్పందించి ఈ మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అవినీతి సొమ్ములో వాటాలు

ఉపాధి పనుల్లో చేసే అవినీతి, అక్రమాల్లో వచ్చిన సంపదను ఏపీడీ మొదలు ఎంపీడీఓ, ఏపీఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు వాటాలుగా పంచుకుంటున్నట్లు సమాచారం. తప్పుడు మస్టర్లు, చేయకున్నా పనులు చేసినట్లుగా బిల్లులు తయారు చేయడం ఉపాధి సిబ్బందికి పరిపాటిగా మారింది. ఉపాధిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలకు చెక్‌పెట్టేందుకు టీసీఎస్ సాఫ్ట్‌వేర్ నుంచి ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌కు మార్చినా అదే వ్యవహారం కొనసాగుతోంది. బ్రహ్మసముద్రం మండలంలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా స్థాయిలో డ్వామా అధికారులు చర్చించుకుంటుండటం గమనార్హం.

విచారణకు ఆదేశించాం: సలీంబాషా, డ్వామా పీడీ



బ్రహ్మసముద్రంలో జరిగిన పరిణామాలపై విచారణకు ఆదేశించాం. ఇలాంటి ఘటనలు జిల్లాలో ఎక్కడా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. విచారణ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు ఉంటాయి. ఇందులో ఎంతటివారు ఉన్నా ఉపేక్షించేదిలేదు. రికార్డుల ప్రకారం పేరు ఉండే వ్యక్తే విధులు నిర్వహించాలి. వారి స్థానంలో వేరే వ్యక్తి పనిచేస్తే ఒప్పుకునేదిలేదు. చేయని పనులకు బిల్లులు పెట్టడం, ఒకే పనికి రెండు సార్లు బిల్లులు పెట్టడం ఇలాంటివి చేస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం.

సంతలో సడేమియా..!

- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి యాడికి గొర్రెల సంత
- మార్కెట్‌యార్డు నుంచి ప్రైవేట్ స్థలంలోకి..
- ఆదాయం అధికారపార్టీ వ్యక్తులకు..
- దిక్కుతోచని స్థితిలో మార్కెట్‌యార్డు సిబ్బంది



ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్న గొర్రెల సంత

యాడికి, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు యాడికి గొర్రెల సంతను తమ అధీనంలోకి తీసుకున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి చెందాల్సిన రుసుము ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళుతోంది. దీనిపై మండలవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక వ్యవసాయ సబ్‌మార్కెట్ యార్డులో ప్రతి సోమవారం గొర్రెల సంత నిర్వహిస్తారు. సంతలో విక్రయానికి వచ్చే గొర్రెలపై వ్యాపారుల నుంచి మార్కెట్‌యార్డు సిబ్బంది రుసుం వసూలుచేసి ప్రభుత్వానికి జమచేసేవారు. ఇలా ప్రతి సోమవారం రూ.30వేల నుంచి రూ. 40వేలు ఆదాయం వస్తున్నట్లు సమాచారం. పండుగ సంత వస్తే రూ.50వేలు దాటుతుందని ఓ అంచనా. ఈ నేపథ్యంలో మూడు వారాలుగా గొర్రెల సంత నిర్వహణను అధికారపార్టీకి చెందిన కొందరు వ్యక్తులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఇందులో కొందరు ఒక వారం, ఇంకొందరు మరో వారం నిర్వహిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు చర్చించుకుంటు న్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డుకు గానీ, స్థానిక గ్రామపంచాయతీకి గానీ చెందాల్సిన గొర్రెల సంత నిర్వహణ ఆదాయం ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్లడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయ సబ్‌మార్కెట్‌యార్డులో గొర్రెల సంత నిర్వహణ కోసం సోమవారం మార్కెట్‌యార్డు సిబ్బంది సమాయత్తమయ్యారు. వ్యాపారం కోసం గొర్రెల వ్యాపారులు వచ్చారు. సమాచారం అందుకున్న ప్రైవేట్ వ్యక్తి మార్కెట్‌యార్డు వద్దకు వెళ్లి ఇక్కడ సంత నిర్వహించరని, తమ స్థలంలో సంత ఉంటుందని అక్కడికే గొర్రెలను తీసుకొని రావాలని చెప్పి వారిని అక్కడికి తీసుకువెళ్లినట్లు మార్కెట్‌యార్డ్ సిబ్బంది తెలిపారు. సంత నిర్వహించే ప్రైవేట్ వ్యక్తులు అధికారపార్టీ వ్యక్తులని, వారిని మేము ఎలా అడ్డుకోగలమని వారు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను తాము పాటిస్తామని, మార్కెట్‌యార్డులో గొర్రెల విక్రయానికి వ్యాపారులు వస్తే తాము రుసుం వసూలుచేసి మార్కెట్‌యార్డు శాఖకు జమచేస్తామని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు గొర్రెల సంత నిర్వహణ, రుసుం వసూలుపై మార్కెట్‌యార్డు సెక్రటరీ రంగనాథను వివరణ కోరగా ఈ విషయాన్ని ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకువెళ్లామని ఆయన ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

థ్యాంక్యూ సార్.. !

- నారా లోకేశ్ ఫ్లెక్సీకి డీఎస్సీ అభ్యర్థుల క్షీరాభిషేకం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో జిల్లా తెలుగు యువత ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సాయినగర్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 16వేలకుపైగా పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడంపై నిరుద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 25 లక్షల ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా నారా లోకేశ్ పని చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు తమ్మినేని వేణుగోపాల్, ప్రసాద్, విజయ్, బొమ్మినేని శివ, పార్థు, సాయి పాల్గొన్నారు.



మంత్రి నారాలోకేశ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న తెలుగు యువత నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు

ఉద్యోగం పేరిట బురిడీ

- రూ.3 లక్షలు వసూలు చేసిన అధికారి
- ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు



నకిలీ ఉత్తర్వులు చూపుతున్న యశ్వంత్

బెళుగుప్ప, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గ్రామ నౌకరు ఉద్యోగాన్ని ఇప్పిస్తానని ఓ రెవెన్యూ అధికారి రూ.3 లక్షలు కాజేశారని శీర్పి గ్రామానికి చెందిన యశ్వంత్ కుమార్ అనే యువకుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అనంతపురంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి ఆధారాలు సమర్పించాడు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఓ అధికారి నకిలీ ఉత్తర్వులతో తనను మోసగించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. శీర్పిలో గ్రామ నౌకరు ఉద్యోగం ఖాళీగా ఉండటంతో తాను ఆ అధికారిని కలిశానని, ఉద్యోగ నియామకానికి ఖర్చవుతుందని విడతలవారీగా తన వద్ద రూ.3 లక్షలు వసూలు చేశాడని, 2023 జూన్ 20న విధుల్లోకి చేరాలని ఆర్డర్ కాపీ ఇచ్చాడని పేర్కొన్నాడు. అది నకిలీ నియామక పత్రమని తెలిసి, డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే దూషించాడని పేర్కొన్నాడు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని తహసీల్దారు షర్మిల అన్నారు. ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారిస్తామని అన్నారు.

సకాలంలో డ్రిప్ పరికరాల సరఫరా

- ఏపీఎంఐపీ రాష్ట్ర అధికారి వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో రైతులకు సకాలంలో డ్రిప్ పరికరాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం స్థానిక ఉద్యాన శిక్షణ కేంద్రంలో పీడీలు రఘునాథ్‌రెడ్డి, సుదర్శన్, ఏపీడీ ఫిరోజ్ ఖాన్‌తో కలిసి ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అనంత జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో రెండో స్థానం, సత్యసాయి జిల్లా రాష్ట్రంలో 4వ స్థానం, జాతీయ స్థాయిలో 5వ స్థానంలో నిలిచినందుకు అభినందించారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో కార్యాచరణ ప్రణాళికల్లో ఎస్సీ, ఎస్టీ రైతులకు మొదటి ప్రాధాన్యం కల్పించాలన్నారు. వంద శాతం డ్రిప్ వాడుతున్న జిల్లాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అభివృద్ధి పనుల పరిశీలన



ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బృందం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సోమవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం వచ్చింది. వారు జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ బృందం నాలుగు రోజుల పాటు జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించనుంది. తొలిరోజు నార్పలలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం నలప రెడ్డిపల్లి, ఆకులేడు, హెచ్ సోదనపల్లిలో గ్రామాల్లో శ్మశానాలకు ఏర్పాటు చేసిన ప్రహరీలను పరిశీలించారు. నల్లపరెడ్డిపల్లిలో గుంజేపల్లి రోడ్డు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం బుక్కరాయసముద్రంలోని సుందర్ నగర్‌లో నిర్మించిన సీసీరోడ్డును పరిశీలించారు. జిల్లా కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మాణం చేపట్టిన వాల్మీకి భవనం అదనపు గదులను పరిశీలించారు. కమిటీ సభ్యులు హేమంత్‌కుమార్, రాజేషతో పాటు స్థానిక అధికారులు జేఈఈఈ వరప్రసాద్, రమణయ్య, ఏఈఈ వెంకట శేషయ్య పాల్గొన్నారు.

యూపీ సీఎంకు నిమ్మలకుంట తోలుబొమ్మ బహూకరణ

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిమ్మలకుంట తోలుబొమ్మలతోపాటు ధర్మవరం పట్టువస్త్రాన్ని బహూకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోమవారం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిమ్మలకుంట తోలుబొమ్మలు, ధర్మవరం పట్టువస్త్రాల గురించి యోగిఆదిత్యనాథ్‌కు మంత్రి వివరించారు. సీఎం కూడా మంత్రికి మధుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకోవాలని, ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని మంత్రి సత్యకుమార్ సీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.



యూపీ సీఎంకు నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరిస్తున్న మంత్రి సత్యకుమార్

కన్నీటి వీడ్కోలు

అశ్రునయనాల మధ్య కేఎం జకీవుల్లా అంత్యక్రియలు

నివాళులు అర్పించిన మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

పాడెమోసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి

అంతిమ యాత్రలో పాల్గొన్న వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు





నివాళులు అర్పిస్తున్న పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు





ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎంపీ అంబికా, రాష్ట్ర కార్యదర్శి ఆలం

అనంతపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు కేఎం సైఫుల్లా తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎం జకీవుల్లా అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య సోమవారం పూర్తయ్యా యి. మధ్యాహ్నం రాంనగర్‌లోని సైఫుల్లా నివాసం నుంచి రాంనగర్ ఫ్లైఓవర్ మీదుగా అశోక్ నగర్‌లోని ఖబరస్తాన్ వరకు వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అంతిమ యాత్ర సాగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్.. జకీవుల్లా పాడె మోసి ఆయనతో వారికున్న అనుబంధాన్ని చాటారు.

ఘన నివాళి

జకీవుల్లా ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందగా... ఆయన పార్థివ దేహాన్ని ఆదివారం అర్ధరాత్రి రాంనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు అక్కడికి చేరుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి జకీవుల్లా పార్థివ దేహంపై టీడీపీ జెండా కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లె రఘునాథ్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, యామిని బాల, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పేరం నాగిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, బాంబేడైయింగ్ నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కేఎం జకీవుల్లా పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళీ, రామలింగారెడ్డి, జేఎల్ మురళీ, గౌస్ మొహిద్దీన్, గాండ్ల విశాలాక్షి, మాజీ మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, సరిపూటి రమణ, కొండవీటి సుధాకర్‌నాయుడు, సింగవరం రవీంద్రనాయుడు, గంగారామ్, వెంకటప్ప, స్వామిదాస్, కుంచెపు వెంకటేష్, గుడిపూటి నారాయణస్వామి, ఉమర్, స్వప్న, సంగా తేజస్విని, సరళ, వడ్డే భవానీ, లక్ష్మీనాయుడమ్మ, బల్లా పల్లవి, కూచి హరి, సైఫుద్దీన్, ఇస్మాయిల్, ఫిరోజ్ అహ్మద్, ముక్తియార్, లక్ష్మీనరసింహ, మణికంఠ బాబు, కృష్ణకుమార్, తాడిపత్రి వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషా, వైసీపీ నాయకులు ఆత్మారామిరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, జనసేనా నాయకులు టీజీ ప్రకాష్, లక్ష్మీపతి, బాబురావ్, తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

పార్టీ అండగా ఉంటుంది: టీడీపీ ముఖ్యనేతలు

జకీవుల్లా కుటుంబానికి తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ముఖ్యనేతలు స్పష్టం చేశారు. జకీవుల్లా ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఒక మైనార్టీ నేతను కోల్పోవడం బాధాకమన్నారు. కేఎం జకీవుల్లా, ఆయన కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నేతలందరూ మాజీ ఎంపీ సైఫుల్లా, కేఎం జకీవుల్లా, కేఎం రహంతుల్లా కుమారులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా నింపారు.



కేఎం జకీవుల్లా పార్థివ దేహంపై పార్టీ కండువా కప్పి నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి





గడ్డం సుబ్రహ్మణ్యం, గౌస్‌మొహిద్దీన్, రాయల్ మురళి, కేశవరెడ్డి తదితరులు..





జేసీ ప్రభాకర్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి నివాళి







విశ్వేశ్వరరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, సాకే గంపన్న నివాళులు








నివాళులు అర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, కాయగూరల లక్ష్మీపతి, సీపీఐ జాఫర్ తదితరులు, కన్నీటి పర్యంతమవుతున్న మహిళలు

టీచర్లకు వైద్య శిబిరాలు

● 24 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందాలనుకునే టీచర్లకు ఈనెల 24 నుంచి 26 వరకూ ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ టీచర్స్ రెగ్యులేషన్ యాక్ట్ -2025 మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు, హెచ్‌ఎంలు అందరూ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలన్నారు. అనంతపురం జిల్లా సర్వజన ఆసుపత్రిలో మెడికల్ క్యాంపులు ఉంటాయన్నారు. టీచర్లు తమ పాత సర్టిఫికెట్లు చూపించి సంబంధిత డాక్టర్లతో పరిశీలన చేయించుకుని కొత్త సర్టిఫికెట్లు పొందాలన్నారు. కొత్త సర్టిఫికెట్ల ఆధారంగానే బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ కేటగిరీ పాయింట్లు వర్తిస్తాయన్నారు.



ఎండిపోయిన వెంకటాపురం చెరువు

అతిథుల ఆకలి కేకలు

సైబీరియా వలస పక్షులకు ఆహారం, నీటి కొరత

భారంగా మారిన పిల్లల పోషణ

అడుగంటిన చెరువులు, కుంటలు

ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్న పక్షులు

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోని అధికారులు

అతిథులకు ఆకలి కష్టాలు మొదలయ్యాయి. మండుతున్న వేసవిలో నీరు, ఆహారం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్ల దూరం నుంచి కుగ్రామమైన వీరాపురానికి వచ్చిన సైబీరియన్ పక్షులు ఆహారం కోసం అలమటిస్తున్నాయి. వందల సంవత్సరాలుగా సైబీరియా ప్రాంతం నుంచి వచ్చి వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో విడిది చేయడం ఈ పక్షుల(పెయింటెడ్ స్టార్క్ లేదా ఎర్ర కాళ్ల కొంగలు)కు అలవాటు. ప్రస్తుతం ఈ గ్రామాల పరిసరాల్లో చెరువులు, కుంటలు అడుగంటడంతో వీటికి తిండి తిప్పలు ఎదురవుతున్నాయి. ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వస్తోంది. తాగే నీళ్లు సైతం అందుబాటులో లేకపోవడంతో కర్ణాటకలోని గుడిబండ, బాగేపల్లి సమీపంలోని పరగోడు, హంసంద్ర డ్యాంలకు పక్షులు రోజూ ప్రయాణించాల్సి వస్తోంది.

చిలమత్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వలస పక్షులకు ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఆహారపు సమస్య వచ్చిపడింది. దాంతో అవి సంతానాభివృద్ధి కంటే ఆహారం కోసమే వెంపర్లాడాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే వీరాపురం, వెంకటాపురం గ్రామాల పరిధిలో గల చెరువులు, కుంటలు అడుగంటాయి. దాంతో పక్షులకు అవసరమైన ఆహారం దొరకడం కష్టంగా మారింది. చెరువుల్లో నీళ్ల ఉంటే పుష్కలంగా చేపలు, క్రిమికీటకాలు వంటివి వాటికి ఆహారంగా అందేవి. అయితే చెరువులు ఎండిపోవడంతో ఆహారం లేకుండా పోయింది.

కష్టంగా పిల్లల పోషణ

పెయింటెడ్ స్టార్క్ పక్షులు ప్రధానంగా సంతానోత్పత్తి కోసమే ఈ ప్రాంతానికి వస్తాయి. వాటి సంతానాభివృద్ధికి ఈ ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉండటంతో వందల సంవత్సరాల నుంచి ఆ పక్షులు వస్తున్నాయి. పిల్లలు ఎగరగలిగే సామర్థ్యం వచ్చేంత వరకు ఇక్కడే ఉంటాయి. ఇది ప్రతి ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు జరుగుతుంటుంది. వాటికి ఆహారం పుష్కలంగా ఉంటే ఎటువంటి ప్రకృతి విపత్తులు వచ్చినా తట్టుకునే శక్తిని కలిగి ఉంటాయి. ఇప్పుడు ఆహారం, నీటి కొరత రావడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకమైంది. పక్షులు బతకడమే కాకుండా వాటి సంతానాన్ని సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో ఆహారం కోసం వందల కిలోమీటర్ల దూరం వెళ్లి ఆహారాన్ని సేకరించి తన పిల్లలకు తీసుకువస్తున్నాయి.

ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు..

తమకు, తమ సంతానానికి అవసరమైన ఆహారం కోసం పెయింటెడ్ స్టార్క్ పక్షులు తమ విడిది కేంద్రాలుగా ఉన్న వీరాపురం, వెంకటాపురం గ్రామాల నుంచి సుదూర ప్రాంతాలకు తరలి వెళుతున్నాయి. వేకువజామునే పక్షులు తమ గూళ్ల నుంచి కర్ణాటకలోని హంసంద్రం, పరగోడు, గుడిబండ డ్యాంలకు చేరుకుంటున్నాయి. అక్కడ వేటాడిన అనంతరం తమ నోటితో చేపలను పట్టుకొని గూళ్లకు చేరుకుంటాయి. ఆహారం కోసం ఎదురు చూస్తున్న పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్నాయి. ఇలా రోజూ వందల కిలోమీటర్ల దూరం అతిథి పక్షులు ఆహారం కోసం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో అలసటకు గురవుతూ నీరసించి పోతున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం

సైబీరియా పక్షులు ఎదుర్కొంటున్న ఆహారం, నీటి కొరత సమస్యను అధిగమించడానికి సంబంధిత అధికారులు తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం. గతంలో అటవీ శాఖ అధికారులు పక్షుల కోసం వీరాపురం చెరువుల్లో తాత్కాలిక నీటి తొట్టెలను ఏర్పాటుచేసి అందులో చేపలను వదిలేవారు. దాంతో కొంత వరకు వాటికి ఆహారం, నీటి సమస్య తీరేది. అయితే ఈ ఏడాది సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. వాటి కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టెలు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటిని బాగు చేసి పక్షులకు సౌకర్యం కల్పించాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.





శిథిలావస్థలో నీటి తొట్టి

పిల్లలకు రక్షణ ఏర్పాట్లు శూన్యం

పక్షి చెట్లపై ఆవాసాలు ఏర్పరచుకున్న పక్షులు గాలి వానలకు తమ పిల్లలను కోల్పోతున్నాయి. చెట్లపై నుంచి కింద పడి కొన్ని గాయపడుతున్నాయి. మరికొన్ని మృతి చెందుతున్నాయి. ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పక్షులు తమ గూళ్ల నుంచి కింద పడి మృతి చెందే అవకాశం ఉంది. గాయపడిన పక్షి పిల్లలకు వైద్యం, ఆహారం అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.



వీరాపురం వద్ద చెట్టుపై సైబీరియా వలస పక్షులు

ప్రతిపాదనలు పంపాం

వీరాపురంలో సైబీరియా వలస పక్షుల రక్షణకై అవసరమైన పనులు చేపట్టడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తాగునీరు, ఆహారం వంటి వాటిని సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. పక్షులకు అవసరమైన చేపలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటికి తాగునీటి సమస్య రాకుండా, సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు చేపడతాం.

-శ్రీనివాసరెడ్డి, పెనుకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపాలి



ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపితే చెరువులకు నీళ్ల తీసుకురావచ్చు. గతంలో పంపింగ్ ద్వారా వీరాపురం, వెంకటాపురం చెరువులకు నీరందిస్తామని చెప్పారు. చెరువుల్లో నీళ్ల ఉంటే పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. గ్రామంలో పక్షుల మనుగడ కోసం స్వచ్ఛందంగా చెరువుల సీజ్‌కి గతంలో ఒప్పందం చేసుకొని వర్షపునీటిని నిల్వ ఉంచుకున్నాం. పక్షుల రాకతోనే వీరాపురం పర్యాటక కేంద్రంగా మారింది. దాన్ని మరింత అభివృద్ధి చేయాలి. అటవీ శాఖ అధికారులు పక్షుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

-శివారెడ్డి, వీరాపురం

రక్షణ ఏర్పాట్లు చేపట్టాలి



చెట్లపై ఆవాసాలు ఏర్పర్చుకున్న పక్షులు గాలి వానలకు తమ పిల్లలను కోల్పోతున్నాయి. గాయపడిన పిల్లలకు నేను సొంతంగా ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉంచి చికిత్స, ఆహారం అందిస్తున్నా. గత ఐదేళ్లుగా వాటి రక్షణ కష్టమైంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గాయపడిన పక్షి పిల్లలకు వైద్యం, ఆహారం అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. -వేణు, పక్షుల సంరక్షణ సేవకుడు. వీరాపురం

క్రైం కార్నర్

ప్రాణంతీసిన అతివేగం

- రెండు బైక్‌లను ఢీకొన్న కారు
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


సాయితేజ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రాణం తీసింది. కారు అతివేగంతో ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ప్యాదిండి గ్రామ సమీపాన సోమవారం ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రామగిరి మండలం శ్రీహరిపురానికి చెందిన భారతి, నరసింహులు దంపతుల పెద్ద కుమారుడు సాయితేజ (24) ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో పనిచేస్తుండేవాడు. స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో విధుల నిమిత్తం ధర్మవరానికి బయల్దేరాడు. ప్యాదిండి వద్దకు వెళ్లగానే ధర్మవరం నుంచి ఎన్ఎస్ గేటు వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. అలాగే ముందు కెళ్లి మరో ప్యాదిండికి చెందిన రమేశ్ ద్విచక్రవాహనాన్ని సైతం ఢీకొంది. ప్రమాదంలో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రమేశ్‌ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరగగానే కారును వదిలేసి, అందులోని వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. కాగా, సాయితేజకు వివాహం కాలేదు.

రైలు కిందపడి యువకుడి మృతి

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని స్థానిక రాజీవ్‌కాలనీ నేషనల్ హైవే బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున సాగర్ (32) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఈయన వలస వచ్చి రాజీవ్ కాలనీ సమీపంలో చిన్న గుడిసె వేసుకొని ఉండేవారని స్థానికులు తెలిపారన్నారు. ఐదేళ్ల కిందట భార్య కూడ మృతి చెందిందన్నారు. తొలుత గుర్తుతెలియని శవంగా నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సుమారు 11 గంటల సమయంలో కొందరు రైల్వే పోలీసు కార్యాలయానికి వచ్చి ఆధారాలు చూపడంతో మృతుడి వివరాలు తెలిశాయన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో యూపీ కార్మికుడు..

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామికవాడలోని హిందూపురం స్టీల్ పరిశ్రమలో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కున్వార్ బహదూర్ సింగ్ (47) మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ ఏఎస్ఐ సురేష్ తెలిపారు. ఆదివారం రాత్రి పరిశ్రమవద్ద స్నానం చేయడానికి వెళ్లాడు. ఈ సందర్భంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే కర్ణాటకలోని గౌరీబిదనూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...


శివారెడ్డి (ఫైల్)

బత్తలపల్లి ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రాయపల్లి సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. మండలంలోని యర్రాయపల్లి సమీపంలోని కొండలో చెట్టుకు వేలాడుతూ కుళ్లిన మృతదేహాన్ని సోమవారం గ్రామస్థులు గుర్తించారు. వారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహం వద్ద లభించిన ఆధారాల మేరకు శివారెడ్డి(43)గా గుర్తించారు. తాడిమర్రి మండలం పులంపల్లికి చెందిన శివారెడ్డి ధర్మవరంలోని ఎరువుల దుకాణంలో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనెల 1 నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ధర్మవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య లత, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని అరవిందనగర్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రోహిణీ కుమార్‌రెడ్డి(60), లక్ష్మీస్వరూప దంపతులు అరవిందనగర్‌లో నివాసం ఉంటున్నారు. రోహణీకుమార్‌రెడ్డికి గత కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా లేదు. లక్ష్మీస్వరూప జనరల్ స్టోర్ నిర్వహిస్తోంది. కొడుకులు వెంకటరమణారెడ్డి బెంగుళూరులో, లోక్‌నాథ్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం రోహిణీ కుమార్‌రెడ్డి తన భార్యతో గొడవపడ్డాడు. ఆ సమయంలో కత్తితో దాడి చేయడంతో భార్య కడుపుపై గాటుపడింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి రెండో కొడుకు వచ్చాడు. తల్లిని చూడటానికి ఆసుపత్రికెళ్లాడు. తండ్రి కుమార్‌రెడ్డి ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నాడు. ఆసుపత్రికి వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చాడు. తలుపులు వేసుకుని తీయలేదు. కొన్నిసార్లు అలా తలుపేసుకుని పడుకునేవాడు. దీంతో వెనుదిరిగి మళ్లీ అరగంట ఆగి వచ్చి తలుపు కొట్టినా తలుపు తీయకపోవడంతో కొడుకు లోక్‌నాథ్‌రెడ్డికి అనుమానం వచ్చింది. తలుపులు పగలకొట్టి చూస్తే...ఇల్లంతా చిందరవందరగా పడి ఉండటంతో పాటు ఉరికి వేలాడుతున్న తండ్రి కనిపించాడు. కిందకు దింపి చూస్తే అప్పటికే మృతి చెందాడు. ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పుట్లూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపాడు గ్రామ శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు సోమవారం ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. సుమారు 50 ఏళ్ల పైబడి ఉన్న వ్యక్తి నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు తెలుస్తోంది. తెల్లని పంచ, చొక్కా ధరించాడని తెలిపారు. మృతిపై గ్రామస్తులను విచారించారు. సీఐ సత్యబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు గొర్రెల పెంపకందారుల మహాసభ

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ మహాసభ సమావేశాన్ని ఈనెల 23న పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయం ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ పర్సన్ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీలక్ష్మీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సహకార యూనియన్ అధ్యక్షులు, పర్సన్ ఇన్‌చార్జిలు, డైరెక్టర్లు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

నేలరాలిన ఆశలు..!

- గాలివానకు పడిపోయిన పంటలు
- దెబ్బతిన్న అరటి, కర్బూజ, వరి, మామిడి, బొప్పాయి
- అన్నదాతకు రూ.1.57 కోట్ల నష్టం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం గాలివాన బీభత్సానికి తోట పంటలు భారీగా దెబ్బతిన్నాయి. అన్నదాతలకు తీవ్ర నష్టం జరిగింది. మామిడి, వరి, కర్బూజ, అరటి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)


శెట్టూరు మండలం బసంపల్లి వద్ద నేలరాలిన మామిడి పండ్లు

రాలిన మామిడి

చెన్నేకొత్తపల్లి మండలంలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పండ్లతోటలకు తీవ్రనష్టం జరిగింది. నాగసముద్రం, పులేటిపల్లి న్యామద్దల, వెంకటంపల్లి, కోటంపల్లి గ్రామాలలో నష్ట తీవ్రత ఎక్కువగా ఉంది. నాగసముద్రం రైతు ఆంజినేయులు నాలుగున్నర ఎకరాలలో సాగు చేసిన అరటి కోత సమయంలో ధ్వంసమైంది. అదే గ్రామానికి చెందిన అంజనేయులు, జయరాం, నాగభూషణం సాగు చేసిన అరటిపంట ధ్వంసమైంది. పులేటిపల్లిలో రైతు కిష్టమ్మ 4 ఎకరాలలో, మాధవరెడ్డి 4 ఎకరాలు, పైలబోయలపల్లిలో వెంకటేశ్వరరెడ్డి 4 ఎకరాలలో సాగు చేసిన అరటి పంట ధ్వంసమైంది.

కర్బూజకు భారీ నష్టం

చెన్నేకొత్తపల్లి మండలంలో పులేటిపల్లిలో లక్ష్మన్న 4 ఎకరాలలో సాగు చేసిన కర్బూజ కోత సమయంలో తుడిచిపెట్టుకుపోయింది. వెంకటంపల్లిలో హనుమంతరెడ్డి 2 ఎకరాలు, రామ్మోహన్‌రెడ్డి 2 ఎకరాలలో సాగు చేసిన కర్బూజ పంట దెబ్బతింది. వెంకటంపల్లిలో ముత్యాలప్ప మామిడి తోట టన్నుకుపైగా మామిడికాయలు నేలరాలాయి. ఇదే గ్రామంలో నాగిరెడ్డి తోటలో 3 టన్నులు, గోవిందరెడ్డి తోటలో ఒకటిన్నర టన్ను మామిడి కాయలు నేలరాలాయి. కోటంపల్లిలో లక్ష్మీదేవి తోటలో మామిడికాయలు నేలరాలాయి. పులేటిపల్లిలో వెంకటేశ్ ఎకరం విస్తీర్ణంలో సాగు చేసిన వరిపంట నేలకొరిగింది. ఇదే గ్రామంలో నారాయణరెడ్డికి చెందిన 2 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతింది. హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. మండలవ్యాప్తంగా చెట్ల కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


రామగిరి మండలం శేషంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు


పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల వద్ద నేలకొరిగిన బొప్పాయి పంటను చూపుతున్న రైతు

అంతటా నష్టమే..

- శెట్టూరు మండలం అయ్యగార్లపల్లి, బసంపల్లి తోటలలో మామిడి కాయలు నేలరాలాయి. బొప్పాయి తోటలు ధ్వంసమయ్యాయి. బసంపల్లి రైతు మల్లయ్య ఐదు ఎకరాలలో సాగు చేసిన మామిడి పంట దెబ్బతింది. ఉద్యాన శాఖ అధికారి గౌసియాబీ పంట నష్టాన్ని పరిశీలించారు. మండలంలో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామాలలో అంధకారం అలుముకుంది.
- పెద్దవడుగూరు మండలం అప్పేచర్లలో రైతు విరూపాక్షిరెడ్డి నాలుగు ఎకరాలలో సాగు చేసిన బొప్పాయి నేల కూలింది. రూ.4లక్షలు నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.
- అమరాపురం మండలం మద్దనకుంటలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి రైతు దేవరాజ్ తోటలో మామిడి కాయలు రాలిపోయాయి. రూ.లక్ష దాకా నష్టపోయాడు.
- సోమందేపల్లి మండలం సుద్దకుంటపల్లిలో రైతు ప్రసాద్ 30 ఎకరాల్లో సాగు చేసిన మామిడి తోటలో పిందెలు నేలరాలాయి. మండల వ్యాప్తంగా మామిడి రైతులు నష్టపోయారు.


చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన చెట్టు

భారీ వర్షం

రామగిరి మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 51.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. కుంటలు, వాగులకు నీరు చేరింది. శేషంపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణ, సమీపంలో ఇళ్ల వద్ద భారీగా నీరు నిలిచింది. ప్రహరీ లేకపోవడం, పాఠశాల ఆవరణ లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం కురిసిన ప్రతిసారీ సమస్య తలెత్తుందోంది. అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసం

తనకల్లు మండలం పూలకుంటపల్లిలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు పెంకుటిల్లు ధ్వంసమైంది. నరేంద్రకు చెందిన ఆ ఇంట్లో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణం నష్టం జరగలేదు. ఇంట్లో టీవీ, ఫ్రిజ్, ఇతర వస్తువులు ధ్వంసమయ్యాయి.

21 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 21 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరులో 72.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 68.2, వజ్రకరూరు 46.2, శెట్టూరు 34.4, కుందుర్పి 29.6, కళ్యాణదుర్గం 29.4, కంబదూరు 18.6, బ్రహ్మసముద్రం 17.0, బెలుగుప్ప 15.2, గుత్తి 14.4, రాయదుర్గం, గుమ్మఘట్ట 10.2, రాప్తాడు 6.0, విడపనకల్లు 5.2, కణేకల్లు 3.6, పామిడి, ఉరవకొండ 3.2, డి. హిరేహాళ్ 2.4, పెద్దవడుగూరు 2.2, యాడికి 2.0, బొమ్మనహాళ్ 1.2 మి.మీ., వర్షపాతం కురిసింది. జిల్లావ్యాప్తంగా 122.4 హెక్టార్లలో రూ.1.57 కోట్ల విలువైన పంట నష్టం వాటిల్లింది. ఇందులో 29 మంది రైతులకు సంబంధించి 31.40 హెక్టార్లలో రూ.80.30 లక్షల విలువైన అరటి, నిమ్మ, మామిడి, బొప్పాయి, కర్బూజ, కళింగర, దానిమ్మ, చీనీ తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 56 మంది రైతులకు సంబంధించి 91 హెక్టార్లలో రూ.77.35 లక్షల విలువైన మొక్కజొన్న పంట దెబ్బతింది.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి: కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి అనేక వ్యయప్రయాసలతో వచ్చి ఇచ్చిన ప్రజల అర్జీలను సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ పాల్గొని 304 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అర్జీలను అధికారులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఎంహెచ్‌ఓ ఫిరోజ్ బేగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జునయ్య, నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖాధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో మహాత్మ జ్యోతిరావు పూలే కమ్యూనిటీ భవన నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని బీసీ నాయకులు సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అడవులను అగ్నిబారి నుంచి కాపాడాలని సాహితీగగన్ మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 604 యూనిట్లు మంజూరు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని లబ్ధిదారులకు 604 యూనిట్లు మంజూరైనట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు, కరువు మండలాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.25.14 కోట్లు మంజూరు చేస్తామన్నారు. కరువు మండలాల్లో రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, అధికారులు పాల్గొన్నారు.

న్యాయాధికారిని కలిసిన కలెక్టర్

అనంతపురం జిల్లా న్యాయాధికారి భీమారావును శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం అనంతపురంలోని కోర్టులో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన జిల్లా న్యాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన భీమ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు లాస్ట్ చాన్స్

- ఇంటర్ సప్లీ ఫీజు చెల్లింపునకు ఆఖరి గడువు

అనంతపురం విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు మంగళవారం ఆఖరి గడువని డీవీఈఓ, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 12 నుంచి 22 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తా మన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూమెంట్ రాసే విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో వెంటనే ఫీజు చెల్లించాలన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు ఫీజు బకాయి ఉందని, పరీక్షల ఫీజు కట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,800 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 4వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 732 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

హంద్రీనీవాను వెడల్పు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిస్తున్న రాంభూపాల్

గుంతకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా హంద్రీనీవాను పదివేల క్యూసెక్కుల నీరు పారే విధంగా వెడల్పు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జి. కొట్టాల గ్రామం వద్ద హంద్రీనీవాలో జరుగుతున్న వెడల్పు పనులను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. సీఎం ప్రకటన మేరకు హంద్రీనీవాను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని, అంతవరకూ లైనింగ్ పనులను చేయరాదని డిమాండ్ చేశారు. రాగులపాడు వద్ద నుంచి వజ్రకరూరు, గుంతకల్లు, పామిడి మండలాల చెరువులకు నీరిచ్చే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పండ్ల తోటల రైతులకు ప్రభుత్వం పరిహారాలను ఇవ్వాన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి. శ్రీనివాసులు, నాయకులు మారుతీ ప్రసాద్, కసాపురం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కేటాయింపులతోనే సీమ అభివృద్ధి

- సదస్సులో వక్తలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సాగుకు అవసరమైన నీటి కేటాయింపులతోనే రాయలసీమ అభివృద్ధి సాధ్యమని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఎస్ఐఎస్ఏ) ఆధ్వర్యంలో సోమవారం ఓ సదస్సును నిర్వహించారు. 'రాయలసీమ కరువు, నీటి సవాళ్లు, పరిష్కారాల సాధ్య, సాధ్యాలు' అంశంపై ఎస్కేయూలో ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. వక్తలుగా జల సాధన సమితి నాయ కులు, న్యాయవాది రామకుమార్, ప్రొఫెసర్ జీవీ రమణ, సాకేహరి, నాగార్జునరెడ్డి, అశోక్ వర్ధన్, రామాంజినేయులు, రాహుల్ హాజరై మాట్లాడారు. మూడు దశాబ్దాల కిందటి వరకు వాగులు, వంకల ద్వారా పారే వర్షపు నీరు, చెరువులు, కుంటల్లోని నిల్వ నీటి ద్వారా వరి, రాగి వంటి పంటలు పండించేవారన్నారు. వర్షాకాలంలో వేరుశనగ, పప్పుశనగ, కందులు, పెసలు, అలసంద, నువ్వులు వంటివి సాగు చేస్తూ వచ్చారన్నారు. ఈ క్రమంలో సాగు విస్తీర్ణం పెరిగి కొంతమేరకు ఆహార కొరత తీరిందని వివరించారు. అనంతరం వర్షాభావం నేపథ్యంలో బోరు బావులను తవ్వుకుని కొన్ని సంవత్సరాలు రైతులు జీవనం సాగించారన్నారు. అయితే కరువు తీవ్రమవడంతో బోరు బావుల్లోనూ నీరు ఇంకిపోయిందన్నారు. దీంతో అనేకమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ వంటి నీటి కాలువలు అరకొరగానే వ్యవసాయానికి ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి ప్రభుత్వాలు మారుతున్నా శాశ్వత పరిష్కారాలు మాత్రం చూపడంలేదని వాపోయారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించడంలేదన్నారు. నీటి వనరుల లభ్యతను గుర్తించడం, వరద నీటిని నిల్వ చేయడం, ఎత్తిపోతల ద్వారా రాయలసీమకు నీటిని తరలించడం, ప్రస్తుతమున్న కాలువలను విస్తరింపచేయడం, అధిక టీఎంసీల నీటిని కేటాయించడం పరిష్కార మార్గాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకటేష్, లక్ష్మి, విశ్వనాథ్, హరిత, చంద్రన్న, విజయ్ పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న వక్తలు

న్యూస్ బాక్స్

డిప్యూటీ కమిషనర్ పావని బాధ్యతల స్వీకరణ


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ పావని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె నగర పాలక సంస్థ కమిషనర్ బాలాస్వామిని, మేయర్ వసీంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా ఉన్న ఆమె చింతల పూడి నగర పంచాయతీ నుంచి అనంతపురానికి బదిలీఅయ్యారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును హిందూపురం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీచేశారు. బదిలీపై వచ్చిన పావనికి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

2న ఉచిత సామూహిక ఉపనయనాలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆది శంకరాచార్య జయంతిని పురస్కరించుకుని బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం ఆధ్వర్యంలో మే 2న జిల్లా కేంద్రంలోని మొదటిరోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సామూహిక ఉపనయనాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు శివరాం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శంకరాచార్యుల విగ్రహానికి అభిషేకాలు చేయడంతోపాటు ఆయన చిత్ర పటంతో నగరోత్సవం నిర్వహిస్తారురు. ఆలయ ఆవరణలో బ్రాహ్మణ పిల్లలకు సామూహికంగా ఉపనయనాలు చేస్తామని వారు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా 9440090060 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉచిత ఖత్నాను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ చిన్నారులకోసం ఈనెల 27న గఫూర్ కాలనీలో నిర్వహించనున్న ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గఫూర్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ పిలుపునిచ్చారు. గఫూర్ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసక్తి ఉన్న ముస్లింలు తమ చిన్నారులకు ఖత్నాను చేయించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖత్నా చేయించుకోదలచినవారు ముందుగా 7989204621 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఉపకరణాల పంపిణీ

నార్పల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామంలో అర్హులైన వయోవృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వచ్చిన ఉపకరణాలను బొందలవాడ ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసాయనాయుడు పంపిణీ చేశారు. వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫారిన్ లాంగ్వేజ్ కోర్సుకు ఆర్డీటీ-ఎస్కేయూ ఒప్పందం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ-ఎస్కేయూ మధ్య ఫారిన్ లాంగ్వేజ్ కోర్సుకు ఒప్పందం చేసుకున్నారు. స్థానిక ఎస్కే యూనివర్సిటీలో ఫారిన్ లాంగ్వేజ్ కోర్సుపై సోమవారం ఆర్డీటీ-ఎస్కేయూ అధికారుల ఇంటర్నల్ కమిటీ సమావేశం నిర్వహించా రు. ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్‌లో ఫారిన్ లాంగ్వేజ్ కోర్సు రెసిడెన్షియల్ బ్యాచ్‌కు సంబంధించి 55మంది విద్యార్థులకు పీజీ డిప్లొమా సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. జూన్ చివరిలో కోర్సు పూర్తి చేసుకుని, జులై 21వ తేదీన ఫైనల్ పరీక్ష నిర్వహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి వెంటనే పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా పరస్పర అంగీకార ఒప్పందం చేసుకున్నారు. మరింత మంది జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి కోసం ఫారిన్ లాంగ్వేజ్ కోర్సులు అందజేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణకు మారి, డీన్ నరసింహన్, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ నాగభూషణరాజు, ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళి, ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ గీతాంజ లి, కోఆర్డినేటర్ జోస్ అంటోనియో, ఎస్కేయూ రమణ, లోకేశ్వర్లు, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణ ఆటవిక చర్య

● ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): దళితులను సాంఘిక బహిష్కరణ చే యడం ఆటవిక చర్య అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి మండిపడ్డారు. దళితుల గ్రామ బహిష్కరణపై ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే హరి, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు మాట్లాడారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం, మల్లం గ్రామంలో దళిత వర్గానికి చెందిన వారిని గ్రామ నుంచి బహిష్కరిస్తున్నట్లు తీర్మానించడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రెడ్డప్ప, జయరామ్, సూర్య, నారాయణ, కుమార్, ముత్యాలప్ప, వెంకటేష్, సాగర్, ఆంజనేయులు, గోవిందు పాల్గొన్నారు. మల్లం గ్రామ సంఘటన ప్రభుత్వానికి మరకలాంటిదని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ అక్కులప్ప ప్రకటనలో విమర్శించారు. అంటరానితనం చాపకింద నీరులా విస్తరిస్తోందనడానికి ఇది నిదర్శనమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కుల వివక్షను రూపు మాపేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్‌చేశారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరచిన విద్యార్థులు

రాప్తాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ టాలెంట్ టెస్ట్ పోటీ పరీక్షల్లో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పాఠశాల ఎండీ కృష్ణ భరత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను, వారి విజ్ఞానాన్ని ఆవిష్కరించడానికి ఈ నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కరస్పాండెంట్ కృష్ణ సమీరా మాట్లాడుతూ నేషనల్ ఒలంపియాడ్ పరీక్షల్లో 200 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం గర్వకారణం అన్నారు. ఈ నేషనల్ ఓలంపిక్‌యాడ్ పరీక్షల్లో మొదటి బహుమతి పొందిన సస్మితారెడ్డి, వెన్నెల విద్యార్థులకు ట్యాబులు, రెండో బహుమతి పొందిన హితీక్ష, శణ్ముక ప్రియ, వైష్ణవికి స్మార్ట్ వాచ్‌లు, మూడో బహుమతి పొందిన నిహంత్, పద్మశ్రీకి హెడ్‌సెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందచేశారు.

ఈ రోడ్డుకు మోక్షం కలిగేనా..?

● గుంతలమయమై, కంకర తేలిన సిండికేట్ నగర్-ఎన్ఆర్ కాలనీ రోడ్డు
● అవస్థలు పడుతున్న ప్రజలు


ఎన్ఆర్ కాలనీ, సిండికేట్ నగర్ మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. గత టీడీపీ హయాంలో నిలిచి పోయిన రోడ్ల నిర్మాణం తిరిగి ప్రారంభమై పూర్తవుతోంది. అయితే అక్కంపల్లి పంచాయతీ పరిధిలోని ఎన్ఆర్‌కాలనీ నుంచి రాచానపల్లి పంచాయతీ పరిధిలోని సిండికేట్ నగర్ మధ్య ఉన్న రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. ఈ రోడ్డు నిర్మాణానికి కూడా గత టీడీపీ హయంలోనే నిధులు మం జూరైనట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం మారడంతో రోడ్డు నిర్మా ణం అటకెక్కింది. అప్పటికే రోడ్డు అధ్వానంగా ఉండేది. దీనికితోడు గత ఐదేళ్లలో రోడుపై గంపెడు మట్టి కూడా పడిన దాఖలాలు లేవు. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. పెద్ద పెద్ద కంకర తేలింది. దీంతో రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రజలు జంకుతున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాంతాల వాసులు నిత్యం అవస్థల ప్ర యాణం సాగిస్తున్నారు.

టీడీపీ హయంలోనే శ్రీకారం

స్థానిక ప్రజల ఇబ్బందులను గుర్తించి 2018-19లో అప్పటి టీడీపీ హయాంలోనే బీటీరోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. నిధులు మంజూరయ్యాయి. మట్టితోలి కంకర పరిచారు. అయితే 2019లో ఎన్నికలు రా వడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారం లోకి వచ్చిన వైసీపీ పాలకులు ఆ రోడ్డు నిర్మాణం గురించి పూర్తిగా వదిలేశారు.

అవస్థల ప్రయాణం

అక్కంపల్లి పంచాయతీ పరిధిలోని ఎన్ఆర్‌కాలనీ నుంచి రాచానపల్లి పంచాయతీ పరిధిలోని సిండికేట్ నగర్ మధ్య రోడ్డు కిలో మీటరు మేర ఉంటుంది. ఆ కొంత రోడ్డు వేసుకుంటే..ఆ రెండు గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది. గత టీడీపీ హయంలోనే రోడ్డు నిర్మాణం పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చకపోవడం, గత ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురవడంతో... రోడ్డంతా పెద్ద పెద్ద కంకర రాళ్లు తేలాయి. దీనికితోడు అడుగుకో గుంత పడింది. దీంతో ఆ రోడ్డు పై ప్రయాణం సాగించేందుకు నిత్యం ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై ప్రయాణమంటే ఒళ్లుహూనం కావాల్సిందే నంటూ వాపోతున్నారు. తిరిగి టీడీపీ అధికారం లోకి వచ్చింది. ఈసారైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు సంబంధిత వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

సమస్యల ఏకరవు

● ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు
● వివిధ సమస్యలపై కలెక్టర్, ఎమ్మెల్యేకి 407 అర్జీల అందచేత


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీదారులు పోటెత్తారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం రాప్తాడు సమీపంలో ప్రసన్నాయపల్లి వద్ద ఉన్న ఆర్‌జేసీ కల్యాణ మండపంలో ని ర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, రామ్మోహన్, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు తదిత రులు హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి 407 మంది వివిధ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రవేశపెట్టారని, ప్రజల నుంచి వచ్చే అర్జీలను జిల్లా అధికారులు సాను కూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎక్కువగా భూ స మస్యలు, నీటి సమస్యలు, ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు తదితరాలపై అర్జీలు వచ్చాయన్నారు. గత వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన నిర్వాకానికి ప్రస్తుతం వందల మంది రైతులు ఇబ్బంది పడుతు న్నారని అన్నారు. తోపుదుర్తి రిజర్వాయర్ నిర్మిస్తామని 150 మంది రైతుల నుంచి దాదాపు 720 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో హోల్డ్‌లో ఉంచారన్నా రు. ఆ భూములపై రుణాలు తీసుకున్న రైతులు ప్రస్తుతం రెన్యువల్‌కు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ ఫిర్యాదులు అందించార న్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామ న్నారు. తలుపూరు వద్ద ఎయిర్‌పోర్టు నిర్మిస్తే విలువైన భూములు కోల్పోతామని రైతులు తెలిపారన్నారు. వంక పోరం బోకులో నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని నగర శివారు కాలనీవాసులు కోరారన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువకు లైనింగ్ వద్దని సిద్ద రాంపురం రైతులు అర్జీ ఇచ్చారన్నారు. రైతుల ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి మెటీరియల్ ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీలో పోస్టులు పెంచాలి : ఏఐవైఎఫ్

అనంతపురం విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీలో భర్తీ చేసే పోస్టులను పెంచాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఆర్గ నైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో 29 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కానీ మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారన్నారు. ఇది నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్రేష్, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవ, సహాయ కార్యదర్శి ధనుంజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను అడ్డుకున్న మాజీ ఫీల్డ్ అసిస్టెంట్

● ఘర్షణ... ఇద్దరికి గాయాలు

శింగనమల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోలూరు గ్రామంలో చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోబోయిన వైసీపీ నాయకుడు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజిన్‌రెడ్డికి టీడీపీ కార్యకర్తలకు చిన్న పాటి ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో అంజిన్‌రెడ్డికి, దళిత రాజు అనే కూలీకి గాయాలయ్యాయి. మండలం పరిధిలోని లోలూరులో సర్వేనంబర్ 115లోని ప్రభుత్వ భూమి 60 ఎకరాల్లో టీడీపీ కార్యకర్తలు అనంతచౌదరి, కొండయ్య నారాయణస్వామి, ఓబిలేసు ఫాంపాండ్ల తవ్వకాల పనులు చేపట్టారు. అయితే సోమవారం పనులు జరుగుతున్న సమయంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్‌రెడ్డి మరో నలుగురు వ్యక్తులతో అక్కడికి వెళ్లాడు. ఇక్కడ పనులు చేయకండి, గ్రామస్థుల అమోదం లేదని వారితో గొడవకు దిగి పనులను అడ్డగించాడు. దీంతో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. తనను కులం పేరుతో దూషించాడని దళిత రాజు అనే కూలీ తోయడంతో కిందపడిన అంజిన్‌రెడ్డికి రక్తగాయాలయ్యాయి. రాజుకు స్వల్పగాయాలయ్యాయి. ప్రభుత్వ భూమిలో అభివృద్ధి పనులను లోలూరుకు చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అడ్డుకుంటున్నాడని తెలియడంతో సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టామని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం

● వ్యకాసం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జల్లి విల్సన్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

నార్పల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బండ్లపల్లిలో సోమవారం కష్టజీవుల పాతయాత్రను వ్యసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని పరిరక్షించు కోవడంలో కూలీల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఉపాధి భృతి ఏడాదికి రూ.12 వేల ఇవ్వాలన్నారు. అలాగే 200 రోజులు పనిదినాలు కేటాయించాలని, సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీశ్, ఆవుల శేఖర్, జాఫర్, వెంకట్రారావు, వేమయ్య, నారాయణస్వామి కేశవరెడ్డి బాలరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి: సీపీఎం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూమిని కాపాడి, అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం రాప్తాడు ప్రాంతీయ కార్యదర్శి రామాంజినేయులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాప్తాడులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పార్టీ నాయకులు కదిరప్ప, పోతలయ్య, సుబ్బిరెడ్డి, పుష్పరాజ్ కలసి కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ..రూరల్ మండలం పరిధిలోని ఇటుకల పల్లి సర్వే నెంబరు 248-1సి1, 248-1సి2లో ప్రభుత్వ భూమి 9.47 ఎకరాలు ఉందన్నారు. కొంత భూమిని గ్రామస్థులు స్మశాన వాటిక, గ్రామ ప్రజల అవసరాలు, పశువుల తాగునీటి కోసం రెండుబోర్లు వేసి వాడుకుంటున్నారన్నారు. ఇందులో కొందరు అక్రమంగా పాసు పుస్తకాలు చేయించుకుని రిజిస్టర్ చసుకున్నారన్నారు. మిగిలిన భూమిని మరికొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ప్లాట్లు వేసి అమ్మకాలు సాగిస్తున్నారన్నారని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా సోమలదొడ్డి గ్రామం ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు, డ్రైజేజీ వ్యవస్థ లేవన్నారు. మస్నీల గ్రామంలో సీసీరోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉంటోందన్నారు. ఓల్టేజీ సమస్యలతో విద్యుత్తు సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

నరసనాయనికుంట వద్ద డంపింగ్ యార్డు వద్దు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసనాయనికుంట గ్రామంలో డంపింగ్ యార్డుకు అనుమతించొద్దని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి పాములాయి రఘు సోమవారం గ్రామస్థులతో కలసి రాప్తాడులో జరిగిన ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీతకు వినతి పత్రం ఇచ్చారు. ఇప్పటికే కొడిమి సమీపంలోని సిప్లాన్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వాసన వల్ల బాధపడుతున్న ప్రజలు, ఇక డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గ్రామస్థులు, టీడపీ నాయకులు నల్లాని గంగాధర్, శ్రీనివాసులు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించండి

రాప్తాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందిరెడ్డిపల్లి వద్ద ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో రాప్తాడు మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించాలని మార్కెట్ యార్డు ఛైర్మన్ సుధాకర్ నాయుడు కోరారు. సోమవారం రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి వద్ద ఆర్‌జేసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేని ఆయన కోరారు. అలాగే బండమీదపల్లిలో బండగుంతను పూడ్చాలని, ప్రసన్నాయపల్లి, బండమీదపల్లిల్లో మహిళా సంఘాల కోసం కమ్యూనిటీ భవనాలు నిర్మించాలన్నారు. రాప్తాడులో శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని సర్పంచ్ సాకే తిరుపాలు కోరారు. మైనార్టీ కాలనీలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గంగలకుంట రమణ, హంపాపురం జయప్ప తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి క్రికెట్ టోర్నీ

కనగానపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 24 నుంచి పోతలయ్య స్వామి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమవుతుందని తెలుగుయువత బట్టా సురేష్ చౌదరి, సర్పంచ్ అంకే రామక్రిష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులు తమ జట్టు పేర్లు నమోదుకు 7569760609, 9492202482 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

గార్లదిన్నె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తే ఊరుకోమని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ హెచ్చరించారు. మండలకేంద్రమైన గార్లదిన్నెలో ప్రధాన రహదారి స్థలాన్ని ఆక్రమించారు. దీంతో వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డుపై వెళుతున్న పాదచా రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రోడ్డు ఇరువైపుల ఆక్రమణలు తొలగిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. రోడ్డు స్థలాన్ని ఎవరైనా ఆక్రమించి రోడ్డుపైకి వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా రోడ్లపై చెత్తచెదారం వేయవద్దని, పారిశుద్య కార్మికులు వచ్చిన సమయంలో పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలన్నారు. రోడ్లపై అపరిశుభ్రత నెలకొనకుండా ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని సూచించారు.


గార్లదిన్నెలో ఆక్రమణలను తొలగించిన దృశ్యం

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై హర్షం

శింగనమల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం హర్షణీయమని మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్ అన్నారు. అయన సోమవారం మాట్లాడుతూ.. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేస్తున్నారని, యవత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవం


జ్యోతులు ఎత్తుకుని ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్థులు

కనగానపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కనగానపల్లిలో సోమవారం ఆంజనేయస్వామికి జ్యోతుల మహోత్స వాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు జ్యోతులను ఎత్తుకుని ఊరేగింపుగా వచ్చి స్వామికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మంగళవారం సల్లాపురమ్మ, పోతలయ్యస్వామి బోనాల ఉత్సవాన్ని జరుపునున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

రైతుల రుణాలను వడ్డీతో రెన్యువల్ చేయాలి

అనంతపురం రూరల్/రాప్తాడు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రైతుల రుణాలను అసలుతో సంబంధం లేకుండా వడ్డీతో రెన్యువల్ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున అన్నారు. మండలంలోని కందుకూరు కెనరా బ్యాంకు ఎదుట సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షుడు రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. జిల్లాలో వరుస కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతోందన్నారు. రీసర్వే జరుగుతున్న క్రమంలో ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో వన్-బి అడంగల్ ఇవ్వకపోవడంతో రెన్యువల్ చేయడానికి టెక్నికల్ సమస్య వస్తోందన్నారు. దీన్ని పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. కేవలం వడ్డీ కటించుకుని రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు పుల్లారెడ్డి, శ్రీరాములు, నల్లప్ప, ఓపిరెడ్డి, రామకృష్ణారెడ్డి, పెద్దన్న, ఓబులేసు, పుల్లన్న, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● రాప్తాడు: రైతుల పంట రుణాలను కేవలం వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యువల్ చేసే విదంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున కోరారు. సోమవారం రాప్తాడులో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో రైతు సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణ, చలపతి, శ్రీకాంత్, నరేష్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

'చిన్నప్పటి నుంచే లక్ష్యం వైపు అడుగేయాలి'


విద్యార్థులను అభినందిస్తున్న సీఐ శ్రీకాంత్

అనంతపురం విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే విద్యార్థులు లక్ష్యం పెట్టుకుని, దాన్ని సాధించే దిశగా అడుగేయాలని వక్తలు సూచించారు. సోమవారం నగంరంలోని భాష్యం స్కూల్‌లో వార్షికోత్సవం నిర్వహించారు. సీఐలు శ్రీకాంత్, హమీద్‌కాన్ ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులు తమ లక్ష్యం కోసం బాల్యం నుంచే కృషి చేస్తే, తల్లిదండ్రులు కూడా సంతోషిస్తారన్నారు. ఆ దిశగా అడుగేయాలని సూచించారు. తర్వాత ఈ విద్యా ఏడాదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ట్రోఫీలను, జ్ఞాపికలను, మెడల్స్‌ను సీఐల చేతుల మీదుగా అందించారు. అనంతపురం జోన్ జెడ్‌ఎంఓ రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, ఇతర టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసంబద్ధమైన ఆరోపణలు తగవు

● గాస్పల్ చర్చి సొసైటీ సభ్యులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తమపై అసం బద్ధమైన ఆరోపణలు చేయడం తగదని, ఆధారాలు చూపించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోర్టు రోడ్డు గాస్పల్ చర్చి సభ్యులు పేర్కొన్నారు. స్థానిక ఆదిమూర్తినగర్‌లోని గాస్పల్ చర్చి కార్యా లయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చర్చి కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఫిలిప్‌తోపాటు విజయ్ కుమార్, సంపత్ కుమార్, ఎలమం దయ్య, డేవిడ్ రాజు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సొసైటీ చట్టం ప్రకారం 2017లో గాస్పల్ చర్చి అసెంబ్లీ ఏడుగురు సభ్యులతో రిజిస్టర్ అయిందన్నారు. ఆనాటి నుంచి వరప్రసాద్‌రెడ్డి కార్యదర్శిగా వ్యవ హరిస్తున్నారన్నారు. చర్చి పరిధిలో చేపట్టిన అన్ని కార్యక్రమాలకు ఆయన సంతకాలు న్నాయన్నారు. అలాగే మోహన్‌రావు, పురుషోత్తం అనే వ్యక్తులు సంఘ రాబడి వసూలులో బ్యాంకుకు జమ చేయకుండా రూ. 15లక్షలకు పైగా లెక్కలు తెలపకపోవడంపై సంఘం ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా తమపై వరప్రసాద్‌రెడ్డి చేస్తున్న నిందారోపణలను సాక్ష్యాధారాలతో నిరూపించా లని, లేనిపక్షంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం

గుత్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పట్టణంలో సోమవారం సీపీఎం నాయకులు భూ పోరాటం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నల్లప్ప మట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పలు వార్డుల్లో సర్వేలు నిర్వహించి ఇళ్లు లేని పేదలను గుర్తించామన్నారు. వారందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలివ్వాలన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా, ధర్నాలు చేసినా చలనం లేదన్నారు. అందుకే పేదలతో కలిసి సర్వే నంబర్ 321లో భూ పోరాటం చేపట్టామని తెలిపారు. ఆ స్థలంలో పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బండల కార్యదర్శి నిర్మల, నాయకులు రామక్రిష్ణ, రేణుక, రమేష్ మల్లేష్, మల్లికార్జున, రేవతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

గుత్తి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు ఆధునిక మెకానిజంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధా సూచించారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఏ-1 ఆవిష్కరణలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక మెకానికల్ సిస్టమ్స్ డిజైన్ ప్రక్రియలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పరివర్తనపై వివరించారు. ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్, స్మార్ట్ తయారీ డిజైన్ ఆప్టిమైజేషన్ వంటి రంగాల్లో ఏ-1 టెక్నాలజీ ఏకీకరణమని అన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, హెచ్ఓడీ ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 30 మంది విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుత్తి ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణం లో పీఆర్ఆర్ ఎంబీఏ కళాశాలలో సోమవారం బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పల్లె కృష్ణకిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో జబ్‌మేళా జరిగింది. ప్రముఖ ఐఆర్టివ్ఆల్‌డిగీ కంపెనీ నిర్వాహకులు నరహరి, ప్రవీణ్, అహమ్మద్ పాల్గొని విద్యార్థులకు మౌఖికంగా ఇంటర్వ్యూలు చేశారు. దాదాపుగా 120 మంది విద్యార్థులు పాల్గొనగా 30 మంది ఉద్యోగాలకు ఎంపిక అయినట్లు కళాశాల సీఈఓ శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌లు ప్రసన్నకుమార్, వెంకటేశ్వరరెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి బాబా పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

పుట్లూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రంథాలయానికి గ్రూప్-1, 2తో పాటు ఎస్ఐ తదితర పోటీపరీక్షలకు సంబంధించిన 150పుస్తకాలను సోమవారం బాలాపురం పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు సహాయపడేందుకు తనవంతుగా ఈ పుస్తకాలను అందించినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయ అధికారి జయరాములు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి: ఆర్డీఓ

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్చిన అర్జీలను ఆర్డీఓ స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో వచ్చే ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు కృషి చేయాలని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

గుండెపోటుతో తమిళనాడు వాసి మృతి

పుట్లూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలవేముల గ్రామంలో బోరు వేసేందుకు వచ్చిన తమిళనాడుకు చెందిన సెంథిల్ కుమార్ (46) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. తమిళనాడులోని తిరుచూరుకు చెందిన సెంథిల్‌కుమార్ రెండునెలలక్రితం బతుకుదెరువుకోసం మండలానికి వచ్చాడు. ఇక్కడ రైతుల పొలాల్లో బోర్లు వేయిస్తుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం చాలవేములలో బోరు వేస్తుండగా ఉన్నట్లుండి గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. స్థానికులు వెంటనే కడపజిల్లా పులివెందుల ఆస్పత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య కవిత ఫిర్యాదు చేశారని, ఆ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

● పోలీసులను ఆశ్రయించిన జి.కొట్టాల మహిళలు


సీఐకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు, బాధితులు

గుంతకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.కొట్టాల గ్రామంలో రాధమ్మ అనే మహిళ తమను మోసం చేసిందని, న్యాయం చేయాలని ఆ గ్రామానికి చెందిన పలువురు మహిళలు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రూరల్ పోలీస్ సర్కిల్ ఆఫీసుకు బాధితులు చేరుకుని సీఐ ప్రవీణ్‌కుమార్‌కు సమస్యను విన్నవించారు. వివిధ ప్రైవేటు క్రెడిట్ కంపెనీల నుంచి రుణాలు ఇప్పిస్తానంటూ రాధమ్మ తమ వద్ద నుంచి ఆధార్, రేషన్ కార్డు, ఏటీఎం కార్డులను తీసుకుందని, తమ పేరిట రుణాలు పొంది డబ్బు సైతం డ్రా చేసుకుందని, కొన్నాళ్ల క్రితం ఆమె ఊరి నుంచి వెళ్లిపోగా, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు అప్పులు కట్టాలంటూ తమను వేధిస్తున్నారని వాపోయా రు. రాధమ్మతోపాటు, ఫైనాన్స్ కంపెనీల ఉద్యోగులు కూడా ఇందులో కుమ్మక్కయ్యారని సీపీఐ నాయకులు ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు గోపీనాథ్, రాయల్ రాము, నాయకులు డైమండ్ నూర్, వెంకట నాయక్, అఖిల్, రోహిత్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం సచివాలయం ముట్టడి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, సమస్యను వెంటనే పరిష్కరించాని కోరుతూ మండలంలోని గోవిందవాడ గ్రామంలోని బీసీ కాలనీ మహిళలు సోమవారం స్థానిక గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. అక్కడ ఖాళీబిందెలతో సచివాలయంలో దిగారు. పలువురు మాట్లాడుతూ తమ కాలనీకి రెండువారాలుగా తాగునీరు రావడం లేదన్నారు. ఇలా అయితే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిపినా ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీశారు. సిబ్బంది వారికి నచ్చజెప్పి తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శికి చెప్పి పరిష్కరిస్తామని తెలిపారు. సమస్యను పరిష్కరింకపోతే సచివాలయాన్ని దిగ్బంధిస్తామని వారు హెచ్చరించి వెళ్లిపోయారు.


సచివాలయంలో ఆందోళన చేస్తున్న మహిళలు

లక్ష్యంతో ముందుకు సాగాలి

● విద్యార్థులకు ప్రభుత్వ విప్ కాలవ సూచన
● ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి హాజరు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 44వ వార్షికోత్సవ వేడుకల్ని సోమవారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కాలవ ముఖ్యఅతిథిగా హాజరై సభలో మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి, క్రమశిక్షణతో మెలగాలన్నారు. అప్పుడే ఉన్నతులుగా ఎదిగి సమాజంలో పేరుప్రఖ్యాతలు పొందుతారని తెలిపారు. చదువుతోపాటు సామాజిక స్పృహ, సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఇటీవల స్మార్ట్‌ఫోన్, టీవీలకు యువత ఎక్కువ ఆకర్షితులై జీవితాన్ని నాశనం చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మంచి భవిష్యత్తుకు అలాంటివి ఏ విధంగాను ప్రయోజనం కాదన్న విషయాన్ని యువత, విద్యార్థులు గుర్తించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోరే ఉత్తమ పౌరులుగా జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఎప్పుడూ తనవంతు సహకారం ఉంటుందని అన్నారు. ఇక్కడ అవసరమైన అదనపు సౌకర్యాల కల్పన కోసం విద్యాశాఖామంత్రి నారా లోకేష్, పీఎస్ కోనా శశిధర్ దృష్టికి తీసుకెళ్లామని, దశలవారీగా వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వారు హామీ నిచ్చారని పేర్కొన్నారు. తర్వాత కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో మెరుగైన ఫలితాల సాధించిన విద్యార్థులకు కాలవ బహుమతులు, మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులు మంజునాథ్‌గౌడ్, రాజు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే అశ్మిత్


చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా రుణాలను మహిళలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన డ్వాక్రా గ్రూపుల మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలానికి ఇద్దరు ఎస్సీలకు చొప్పున నాలుగు మండలాలకు కలిపి రూ.13లక్షల రుణాలు పీఎం ఏజేఏవై పథకం కింద మంజూరయ్యాయని తెలిపారు. వీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకొని మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. ప్రస్తుతం వచ్చిన రుణాన్ని కిరాణాషాపులు, పాడిపరిశ్రమ తదితర వాటిపై ఉపయోగిస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. ప్రభుత్వం డ్వాక్రాలకు అనేక రుణాలు మంజూరుచేసి సహాయ సహకారాలు అందిస్తోందని అన్నారు. రుణాలు తిరిగి సరిగా చెల్లించినట్లయితే మరింత రెట్టింపులో మంజూరవుతాయని చెప్పారు. అనంతరం రుణాలకు సంబంధించిన చెక్కును మహిళలకు పంపిణీ చేశారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ వీరాస్వామి, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామదట్ల గ్రామంలో కర్ణాటక మద్యంను విక్రయిస్తున్న తలారి శారదమ్మ అనే మహిళను అరెస్టు చేసి 32 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. తర్వాత ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు. అందిన సమాచారం మేరకు దాడులు చేశామని పేర్కొన్నారు. ఎస్ఐ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారీదారుల అరెస్టు

గుంతకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరిపల్లిలో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో సారా తయారుచేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు గుంతకల్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరాం, ఎస్ఐ సుశీలమ్మ, ఉరవకొండ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

గుంతకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తర్వాత తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు రఘునాథ రెడ్డి, సత్తార్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్, మత్తుపదార్థాల జోలికి వెళ్లకండి

● యువతకు పట్టణ సీఐ యువరాజు సూచన


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): యువత బెట్టింగ్, మత్తుపదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పట్టణ సీఐ యువరాజు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం అధికంగా యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, క్రికెట్ బెట్టింగ్‌లు, మట్కా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోజులో పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై పూర్తిగా నిఘా పెట్టాలన్నారు. మొబైల్ ఫోన్లు చూసేటప్పుడు ప్రత్యే నిఘా వేయాలన్నారు. రెండు రోజుల క్రితమే హిందూపురంలో ఓ యువకుడు బెట్టింగ్ భూతానికి బలైన విషయాన్ని గుర్తు చేశారు. ఎవరైతే వ్యసనాలకు బానిలయ్యారో తమకు తెలియజేస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి దారిలో పెడతామని అన్నారు. ఈ విషయంలో నియోజకవర్గ ప్రజలు పోలీసులకు సహరించాలని కోరారు.

నీటి సరఫరా నిర్వహణ పరిశీలన

యాడికి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): యాడికి గ్రామ పంచాయతీలో నీటి సరఫరా నిర్వహణ తీరు లోపంతోనే తరచూ నీటికొరత ఏర్పడుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ నీటిసరఫరా నిర్వహణను సోమవారం ఆయన పరిశీలించారు. పలు కాలనీల్లోకి వెళ్లి నీటిసరఫరాపై సిబ్బందితో చ ర్చించారు. అనంతరం మాట్లాడుతూ జనాభా అవసరానికి మించి నీటిని సరఫరా చేస్తు న్నా నీటికొరత ఎందువల్ల ఏర్పడుతున్నదో తక్షణ మే పరిశీలించాలని ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. దీంతో నీటిసరఫరా నిర్వహణ తీరును పరిశీలించినట్లు తెలిపారు. నీ టిని సరఫరా చేసే కార్మికుల నిర్లక్ష్యంతోనే నీటికొరత ఏర్పడుతున్నట్లు చెప్పారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై తాగునీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట టీడీ పీ నాయకులు హరినాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రుద్రమనాయుడు, పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నీలకంఠ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన స్థల పంచాయితీ

యల్లనూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఈద్గా కాంపౌండ్ నిర్మాణ పంచాయతీ చివరికి పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక కోడిమూర్తి రహదారి పక్కన ఈద్గా మైదానంలో పండుగల సమయంలో ముస్లింలు ప్రార్థనలు చేస్తుంటారు. అయితే ఈ స్థలం అభివృద్ధి కోసం ముస్లింలు రెండురోజులక్రితం కాంపౌండ్ నిర్మాణానికి పునాదులు తవ్వారు. ఇందుకు కోటవీధికి చెందిన పలువురు కాలనీవాసులు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆదివారం సాయంత్రం ఈ విషయంలో ఇరువర్గాల వారు వాదించుకున్నారు. విషయం తెలిసి ఎస్ఐ రామాంజనేయులు సోమవారం స్టేషన్‌కు పిలిపించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

దుండగుడిని కఠినంగా శిక్షించాలి

పెద్దవడుగూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రచేడు గ్రామంలోని దళితులకు చెందిన మామిడిచెట్లు నరికిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండయ్య మాట్లాడుతూ ఇదే గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని, అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. అనంతరం వినతిపత్రంను తహసీల్దార్ ఉషారాణికి అందజేశారు. నాయకులు, ఆదినారాయణ, భూపతి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓంశాంతినగర్‌లో నాలుగురోజుల క్రితం జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన మహేష్‌కుమార్ (29) బెంగళూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. పామిడి మండలకేంద్రానికి చెందిన మహేష్ కుమార్ తాడిపత్రిలో వివాహం చేసుకున్నాడు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా అత్తగారింటికి వచ్చాడు. అయితే మరుసటిరోజు ఎదురింటి వా రు ఘర్షణపడుతుండగా మహేష్‌కుమార్ వారిని విడిపించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఫిరోజ్ అనే వ్యక్తి కత్తితో దాడిచేసి గాయ పరిచాడు. స్థానికులు వెంటనే అతడిని అనంతపురం తరలించి తర్వాత మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మణి ఫిర్యాదు మేరకు ఫిరోజ్, ఖాజీబీపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక తరలింపుపై వివాదం

బెళుగుప్ప, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇసుక తరలింపుపై సోమవారం రెండు గ్రామాల మధ్య వివాదం నెలకొంది. నదీ పరివాహ ప్రాంతం తమ గ్రామ పరిధిలో ఉందని, కనుక తరలించకూడదంటూ ఆత్మకూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ల యజమానులను కాలువపల్లికి చెందిన ట్రాక్టర్ల వారు అడ్డుకున్నారు. ఆత్మకూరు వారు ప్రతిరోజూ 20కి పైగా ట్రాక్టర్లలో పెన్నానది నుంచి ఇసుకకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, ఇకనుంచి వారు ఇక్కడికి రాకూడదని కాలువపల్లి వారు అడ్డుజెప్పడంతో రెండు గ్రామాల మధ్య వివాదం మొదలైంది. ఏఎస్ఐ రాందాసు, హెడ్ కానిస్టేబుల్ జనార్దన్ ఘటనా స్థలికి వెళ్లి ఇరు గ్రామాల వారు ఇసుక తరలించరాదని హెచ్చరించారు.

పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలి

కణేకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో అధికారుల కొరతతో రైతులు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనుక పూర్తిస్థాయిలో అధికారులను, సిబ్బందిని నియమించాలని సీపీఎం నాయకులు కోరి నాగరాజు, రైతు సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం బ్యాంకు మేనేజర్‌ను కలిసి విన్నవించారు.

ఆలయ భూములను ఎస్సీలకు ఇప్పించండి

విడపనకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో గల ఆలయ భూములు భూస్వాముల సాగులో ఉన్నాయని, వాటిని పేదలైన ఎస్సీలకు ఇప్పించాలని గడేకల్లు ఎస్సీ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దారు చంద్రశేఖరయ్యను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. పలువురు మాట్లాడుతూ గడేకల్లులో వివిధ ఆలయాలకు చెందిన వందల ఎకరాల భూమిని దాదాపుగా 20 ఏళ్లు నుంచి గ్రామంలోని భూ స్వాములే సాగు చేసకుంటున్నారన్నారు. అందులో వచ్చిన ఆదాయాన్ని దేవాలయాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఆ భూములను పేదలైన తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

కళ్యాణదుర్గంలో భారీ వర్షం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా టౌన్ సీఐ యువరాజు ఆధ్వర్యంలో సిబ్బంది జాగ్రత్తలు చేపట్టారు. ముఖ్యంగా స్థానిక పాత బస్టాండ్ వద్ద కల్వర్టు పనులు జరుగుతుండడంతో మట్టిలోకి వాహనాలు కూరుకుపోయే అవకాశం ఉంది. దీంతో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుని, ఆ కల్వర్టు మీదుగా రాకపోకలు బంద్ చేశారు. వేరే ప్రాంతాల నుంచి రాకపోకలు సాగే విధంగా చర్యలు చేపట్టారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

బొమ్మనహాళ్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని ఎస్ఐ నబీరసూల్ సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. మండలంలోని ఉద్దేహాళ్‌కు చెందిన నలుగురు క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు చేసి, వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశామన్నారు. ఈజీ మనీకోసం సెల్‌ఫోన్లలో యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ అయ్యిందని తెలిపారు. వారి నుంచి రూ. 30వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకోంటామని ఆయన హెచ్చరించారు.

సంగీతంలో తండ్రి, కూతురు గిన్నిస్ రికార్డ్


ఇటీవల హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న పెన్నోబిలం, గ్రేస్ ఇవాంజెలిన్

కూడేరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన తండ్రి కూతురు సంగీతంలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించారు. ముద్దలాపురంలో దళిత కుటుంబానికి చెందిన జన్నా పెన్నోబిలం తపాలా శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. సంగీతంపై తనకున్న మక్కువతో ఆ కళపై పదును పెట్టాడు. తనతో పాటుగా కుమార్తె ఇవాంజెలిన్‌ను కూడా సంగీతంలో ప్రోత్సహించారు. కాగా 2024 డిసెంబర్ 1వ తేదీన విజయవాడలోని హలేల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ఆన్‌లైన్ సంగీత ప్రదర్శన నిర్వహించారు. ఇందులో ప్రపంచ దేశాల నుంచి 1092 మంది సంగీత విద్యాంసులు పాల్గొని అందరూ ఒకేసారి ఒక గంట వ్యవధిలో సంగీతంలోని మూడు సరళీ స్వరాలను కీ బోర్డులో వాయిస్తూ ఆలాపన చేశాం ్వ. వాటిని నిర్ణేతలు పరిశీలించి 1046 మందిని విజేతలుగా ప్రకటించారు. వారిలో జన్నా పెన్నోబిలం, ఆయన కుమార్తె ఇవాంజెలిన్ ఉన్నారు. వీరికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును ప్రకటించారు. ఈనెల 14న హైదరాబాద్‌లో హలేల్ సంగీత పాఠశాల అధినేత దండంగి వేణుగోపాల్ తమకు గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లను, మెడల్స్‌ను అందించారని జన్నా పెన్నోబిళం సోమవారం మీడియాకు తెలిపారు.

ఫిర్యాదులపై విచారణ

యాడికి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదులపై సోమవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. మండలకేంద్రంలో గత మార్చి 24వ తేదీన నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో నిట్టూరు ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి కూలీలకు పనులు కల్పించడం లేదని, అలాగే అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆరోపణ చేస్తూ పలువురు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా.. తనను విధుల నుంచి తొలగించాలని కొందరు ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ తిరిగి ఫిర్యాదు చేశారు. వీటిపై ఏపీడీ స్థాయి అధికారితో విచారణ జరిపిస్తామని ప్రజావేదికలో అధికారులు ఇరువర్గాలకు సర్ది చెప్పారు. ఈ మేరకు సోమవారం నిట్టూరు గ్రామానికి వచ్చిన ఉపాధిహామీ పథకం అంబుడ్స్‌మెన్ శివారెడ్డి, ఏపీడీ పుల్లారెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఏపీఓ మద్దిలేటి ఉపాధిహామీ కూలీలను, ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామిని, గ్రామస్థులను విచారించారు. ప్రజావేదికలో ఇచ్చిన ఫిర్యాదులపై వివరణలు రాసి ఇవ్వాలని తెలిపారు. దీనిపై నివేదికను ఉపాధి పథకం పీడీకి నివేదిస్తామని, తర్వాత వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. నిట్టూరు సమస్యాత్మక గ్రామం కావడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌పై అధికారులు విచారణకు సందర్భంగా ఎటువంటి అవాంఛనీ య సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

గుంతకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసాయి ఉమెన్స్ కళాశాలలో రెండు నెలలుగా పోటీ పరీక్షలకు నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఆర్‌ఆర్‌బీ, గ్రూప్-డీ, కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలకు సంబంధించి స్థానిక డీవైఎఫ్ఐ నాయకులు ఉచిత కోచింగ్ చేపట్టారు. శిక్షణ ముగింపులో ఎస్ఎస్‌జీఎస్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్కే నాయుడు, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

కణేకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 1996-97వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ప్రకటనలో కోరారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగను పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం టీడీపీ సీనియర్ నాయకుడు కొత్తపల్లి తిమ్మరాజు మజ్జిగ పంపిణీ చేపట్టారు. కార్యక్రమాన్ని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సోమవారం కార్యాలయానికి ప్రజలు ఎక్కువగా వస్తుంటారని గుర్తించిన తిమ్మరాజు వేసవిలో మజ్జిగ పంపిణీ చేపట్టడం అభినందనీయమన్నారు. తర్వాత సుమారు 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, స్టోర్‌డీలర్ సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్, టీడీపీ నాయకులు అప్పారావు, పయ్యావుల నాగరాజు, కొత్తపల్లి రవి, గాలి బసప్ప తదితరులు పాల్గొన్నారు.

15.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

బెళుగుప్ప, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 15.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు అధికారులు తెలిపారు. నక్కలపల్లిలో భీమిరెడ్డికి చెందిన ఇంటిపై పిడుగు పడటంతో గోడలు బీటలు వారాయి.

రాయితీతో వ్యవసాయ పరికరాలు

శెట్టూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన రైతులకు 40 నుంచి 50 శాతం రాయితీతో ఉద్యానవన యాంత్రీకరణ కింద తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, మ్యాంగో ఫ్రూట్ కవర్‌లను ప్రభుత్వం పంపిణీ చేయనుందని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, మండలాల ఉద్యానవన శాఖాధికారిణి గౌసియాబీ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2025-26వ ఆర్థిక సంవత్సరంలో అరటి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్స్, బంతిపూలు, చామంతి, కనకాంబరం తదితర ఉద్యానవన పంటలు పండించి ఈ పంట నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. ఆసక్తి కలిగిన మండల రైతులు ఈ నెల 27వ తేదీ లోగా రైతు సేవా కేంద్రాలలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి


నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కంబదూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని మండలకేంద్రంలో ముస్లింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందచేశారు. అనంతరం అక్కడి నుంచి పోస్టాఫీస్ సర్కిల్ మీదుగా తహసీల్దారు కార్యాలయం వద్ద వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. తర్వాత తహసీల్దార్ బాలకిషన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బెళుగుప్ప, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనిమిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు హెచ్ఎం బాల హరినాథ్ అధ్యక్షతన సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎంఈవో మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. చదువు ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బసవ జయంతిని విజయవంతం చేయండి

ఉరవకొండ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మే ఒకటవ తేదీన నిర్వహించే బసవ జయంతిని విజయవంతం చేయాలని స్థానిక గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి పిలుపునిచ్చారు. గవిమఠంలో సోమవారం జరిగిన వీరశైవ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బసవేశ్వరుల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామనడం హర్షణీయమన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాన్ని నియోజక వర్గంలోని వీరశైవులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం నాయకులు నాగనగౌడ్, వీరేష్, నిరంజన్‌గౌడ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్

పెద్దపప్పూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాపై స్థానిక పోలీసులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పెన్నానదిలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.